ONE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
వెలుగు
SHANMUKHAVELUGU
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152


Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 261
శనివారం 17 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

స్థానిక సమరానికి టీడీపీ స్కెచ్..

అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పక్కా వ్యూహం



పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన టీడీపీ అధిష్ఠానం

సీఎం చంద్రబాబు, లోకేశ్, పల్లా నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ

క్షేత్రస్థాయి అభిప్రాయాలు, ప్రజామోదం ఆధారంగా వడపోత

మేయర్లు, ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నిక నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ

ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుతో అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 16)

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ, సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం పార్టీ వద్ద ఉన్న సమాచారంపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరిస్తున్నారు. అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజామోదం, నాయకత్వ లక్షణాలు, సేవా నిబద్ధత వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీకి సంబంధించి లోతైన విశ్లేషణ జరుపుతూ వడపోత కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నారు. ఈసారి మేయర్లు, మునిసిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండటంతో అభ్యర్థుల ఎంపిక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ▶2లో

ఇంద్రకీలాద్రిపై సీఎం చంద్రబాబు దంపతుల ప్రత్యేక పూజలు

అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణ





(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 16)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రకీలాద్రి ▶మిగతా 2లో

రాయలసీమలో ఉద్రిక్తత.. ఎన్నికల సంఘానికి తెదేపా ఫిర్యాదు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 16)

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా రాయలసీమలోని పలు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనలపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెదేపా ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ నేతలు వర్ల రామయ్య, అశోక్‌బాబు తదితరులు ఎస్‌ఈసీని కలిసి పుంగనూరు, రాయచోటి, ధర్మవరం, తిరుపతిలో వైకాపా ▶2లో

దక్షిణాదిన బలమైన నేతగా దళపతి విజయ్ ?

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 16)

తమిళ సూపర్ స్టార్, దళపతి ఇలా జోసెఫ్ విజయ్ పేరుకు ముందు ఎన్నో విశేషణాలు ఉన్నాయి. అవన్నీ ఆయన సినీ క్రేజ్ కి నిదర్శనాలు. ఇక విజయ్ రెండేళ్ల క్రితం టీవీకే పేరుతో పార్టీ పెట్టారు.



ఆ పార్టీని 2026 మేలో జరిగిన ఎన్నికల్లో బరిలోకి దించారు. సొంతంగా పోటీ చేసి 108 సీట్లు సాధించిన కాంగ్రెస్ ఇతర మిత్రులతో కలసి ఆయన ప్రభుత్వాన్ని స్థాపించారు. అలా రాజకీయ ఎంట్రీతోనే తొలి టార్గెట్ లోనే సీఎం సీటుని సాధించిన విజయ్ గ్రేట్ అనిపించుకున్నారు. ఇక ఆయన సీఎం గా అయిదు నెలల పాలన పూర్తి చేశారు. ఆయన పాలన గురించి జనాలు ఇంకా ఏ నిర్ణయానికి రాలేదు, ఒక విధంగా చెప్పాలంటే హానీమూన్ పీరియడ్ కంటిన్యూ అవుతోంది. విజయ్ పట్ల సినీ ఆరాధనాభావం తమిళనాడులో ఈ రోజుకీ ఉంది. అయితే అది రాష్ట్రం వెలుపలకు కూడా విస్తరించడమే విశేషం.

వ్యూహమా లేక : విజయ్ తమిళనాడుకే పరిమితం అయిన నటుడు కాదు, ఆయన సినిమాలు గతంలో డబ్ అయి మొత్తం దక్షిణాది భాషలన్నింటిలోనూ జనాలను అలరించాయి. అదే సమయంలో ఆయన నటనతో అందరికీ సుపరిచితం అయ్యారు. అందుకే విజయ్ పార్టీ పెట్టి రాజకీయాల్లోకి రావడంతో ఆయన గురించి ▶2లో

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 16)

ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా ▶2లో



ఇరాన్ పై అమెరికా కొత్త బాంబు !

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 16)

యుద్ధంలో భాగంగా అమెరికా ఇరాన్ మీద ఒక కొత్త అతిపెద్ద బాంబు ప్రయోగించనుందన్న వార్త సంచలనం రేపుతున్నది. సీఎన్ఎన్ ప్రకటించిన రిపోర్ట్ ప్రకారం 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ (మీ్ూాదీ)'గా చెప్పుకునే ప్రయోగించే అవకాశం ఉందని సమాచారం. అయితే అమెరికాలో మిడ్ టర్మ్ ఎన్నికల నేపథ్యంలో దీనిని ఎన్నికల ముందు లేదా తర్వాత వేయొచ్చని భావిస్తున్నారు. ఈ బాంబు అధికారిక పేరు దీని నిక్ నేమ్ మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్. దీని బరువు 9.8 టన్నులు



ఉంటుందని, దీని తయారీలో 18,700 పౌండ్ల ఆర్డీఎక్స్, టీఎన్టీ, అల్యూమినియం పౌడర్ మిశ్రమం వాడారని తెలుస్తుంది. దాదాపు 30 అడుగుల పొడవు, 40.5 అంగుళాల వ్యాసం ఉన్న ఈ బాంబు భూమికి ఆరు అడుగుల

అభ్యర్థుల ఎంపికలో జగన్ కొత్త వ్యూహం !

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 16)

వైసీపీకి స్థానిక సంస్థల ఎన్నికలు ఎంత ప్రధానమో గత కొన్ని నెలల నుంచి జగన్ పార్టీ నేతలకు విడమరచి చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి వైసీపీ లేచి కూర్చునే అవకాశం ఉంటుందని పార్టీ గ్రాఫ్ ఏ మాత్రం పెరిగినా అది బూస్టప్ అయి 2029 నాటికి ఫ్యాన్ గిర్రున తిరిగేందుకు ఆస్కారం కల్పిస్తుందని వైసీపీ అధినాయకత్వం భావిస్తోంది. అంతే కాదు 2024 ఎన్నికల్లో వైసీపీ 40 శాతం ఓటు షేర్ సాధించిందని అందువల్ల పార్టీకి జనాదరణ ఉందని కూడా జగన్ అంచనా వేస్తున్నారు. ఇక గడచిన రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం పట్ల జనాలలో అసంతృప్తి పెరిగిందని అది కూడా వైసీపీకి ప్లస్ అయి తీరుతుందని కూడా లెక్క వేస్తున్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు కాకుండా పోటీ చేయాలని జగన్ సూచిస్తున్నారు.

ఈ సారి కొత్త రూట్ : అయితే అభ్యర్థుల ఎంపిక విషయంలో జగన్ ఈసారి ఆచీ తూచీ వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నేరుగా తానే ఈ ప్రక్రియలో పాలు పంచుకుంటు న్నారు. ప్రతీ జిల్లా నుంచి ప్రతీ సీటుకూ ఆశా వహులు అయిన ముగ్గురి పేర్లను షార్ట్ లిస్ట్ చేసి ▶2లో





భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం

బ్యాంకాక్‌లో జరిగిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ సమావేశాల్లో వ్యాఖ్యలు

▶2లో

మొదటిపేజీ తరువాయి

స్థానిక సమరానికి టీడీపీ సై..

ఈ నేపథ్యంలో కేవలం పార్టీ కేడర్‌లోనే కాకుండా ప్రజల్లో మంచి పేరున్న, బలమైన అభ్యర్థులకే పట్టం కట్టాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో వ్యక్తిగత ఇమేజ్ గెలుపోటములను ప్రభావితం చేస్తుందన్న అంచనాతో అన్ని కోణాల్లో ఆలోచించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.స్థానిక సంస్థల పాలన ప్రజల దైనందిన జీవితంతో ముడిపడి ఉంటుందని, అందుకే అత్యుత్తమ నాయకత్వాన్ని ప్రజలకు అందించాలన్నది తమ లక్ష్యమని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ తమ పాలన ఉండేలా ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాభివృద్ధిని మరింత వేగవంతం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

రాయలసీమలో ఉద్రిక్తత.. ఎన్నికల సంఘానికి తెదేపా ఫిర్యాదు

సృష్టించిన విధ్వంసంపై ఫిర్యాదు చేశారు. అన్నమయ్య జిల్లా పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద వైకాపా కార్యకర్తలతో కలిసి లోక్‌సభ ఎంపీ మిథున్‌రెడ్డి దాడులకు తెగబడినట్లు తెదేపా నేతలు ఎస్ఈసీకి తెలిపారు. తెదేపా కార్యకర్తలు, ప్రజలపైకి మిథున్‌రెడ్డి కాన్వాయ్ దూసుకెళ్లిందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలను ఎస్ఈసీకి అందజేశారు. అధికారులను భయభ్రాంతులకు గురి చేసేలా పెద్దిరెడ్డి కుటుంబం వ్యవహరిస్తోందని తెదేపా నేతలు ఆరోపించారు.

దక్షిణాదిన బలమైన నేతగా దళపతి విజయ్ ?

దక్షిణాది జనాలు కూడా ఎక్కువగా తెలుసుకునేందుకు ఆసక్తి చూపించారు. ఇక విజయ్ తమిళనాడుకు సీఎం అయినా ఆయన పర్యటనకు ఇతర రాష్ట్రాలలో చూస్తే విజయవంతం అవుతున్నాయి. దానికి కారణం ముందే చెప్పుకున్నట్లుగా ఆయన సినీ నటుడు కావడమే. ఆయన తనను తాను ప్రత్యేకంగా పరిచయం చేసుకోవలసి లేకపోవడం ప్లస్ పాయింట్. ఆయన హీరో, దానికి సీఎం పదవి జత చేరింది. దాంతో జనాల ఆసక్తి మరింత పెరుగుతోంది. అలా ఇటీవల విజయ్ ఏపీకి వచ్చారు. విజయవాడలో ఆయన అధికారిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక బహిరంగ సభలో ప్రసంగించినపుడు జనాల నుంచి మంచి స్పందన లభించింది. అయితే ఇది రాజకీయ స్పందన అని అపుడే పొరపడరాదు, ఆయన హీరో కాబట్టే ఈ కేరింతలు హుషారు అన్నది అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆయన ఎక్కడికి వెళ్ళినా జనాలు వెంటపడడం కూడా హీరోగా మోజుతోనే అన్నది కూడా అవగాహన చేసుకోవాలి.

కేరళలో పార్టీ :అయితే విజయ్ విషయానికి వస్తే ఆయన కేవలం తమిళనాడుకే పరిమితం అయి రాజకీయాలు చేస్తారా అంటే ఇపుడే ఎవరూ చెప్పలేరు, ఎందుకంటే హీరోగా దశాబ్దాల ఖ్యాతి ఆయన సొంతం అయినా రాజకీయ నాయకుడిగా ఆయన ఇంకా రెండేళ్ల వయసు మాత్రమే కలిగిన నాయకుడిగా చూడాల్సి వస్తుంది. ఇక కేరళలో అయితే విజయ్ తన పార్టీని ఏర్పాటు చేశారు. అక్కడ ఆయన ఒక నటుడికే రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించారని అంటున్నారు. మలయాళ సీనియర్ నటుడు ఎస్. దేవన్ కేరళలో టీవీకే పార్టీ బాధ్యతలను స్వీకరించడానికి సిద్ధమయ్యారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేరళలో పార్టీని విస్తరించేందుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో కేరళ పర్యటనను కూడా విజయ్ పెట్టుకున్నారని అంటున్నారు.

అక్కడ కూడా క్రేజ్ :వాస్తవంగా చెప్పాలంటే సినీ నటుడిగానే విజయ్ కి దక్షిణాది రాష్ట్రాలలో ఆదరణ లభిస్తోంది. ఆయన కేరళలో పర్యటిస్తే కచ్చితంగా జనాలు పెద్ద సంఖ్యలో వస్తారు. ఈ క్రమంలో త్రిస్సూర్‌లో విజయ్ ప్రతిపాదిత పర్యటన సైతం సక్సెస్ అవుతుందని అంచనా ఉంది. అంత మాత్రం చేత కేరళలో టీవీకేకు బ్రహ్మరథం జనాలు పడతారని అనుకుంటే అపోహ అవుతుందని అంటున్నారు. కేరళకు ఒక సొంత రాజకీయ సంప్రదాయం ఉంది. అలాగే అక్కడ ఇప్పటికే బాగా పాతుకుపోయిన పార్టీలు వాటికి కట్టుబడిపోయిన ఓటర్లు ఉన్నారు. ఈ క్రమంలో విజయ్ త్రిస్సూర్‌లో పర్యటన వల్ల పెద్దగా పార్టీకి రాజకీయ లాభం వస్తుందని ఇప్పటికిపుడు అంచనా వేస్తే తప్పు అవుతుంది. అది కాలగమనంలో తేలాల్సిన విషయం.

ఏపీలోనూ మోజు వెనక :అదే సూత్రం ఏపీకి కూడా వరిస్తుంది. ఏపీలో దసరా ఉత్సవాలకు విజయ్ హాజరు కావడాన్ని కేవలం ఒక నటుడుగా పొరుగు రాష్ట్రం సీఎం గా జనాల ఆదరించినదిగానే చూస్తారు. అంతే తప్ప టీవీకే సిద్ధాంతాలు విజయ్ ని రాజకీయ నేతగా అభిమానించే క్రమంలో అంత పెద్ద ఎత్తున జనాలు పోగు అయి నీరాజనాలు పలికారు అనుకోవడం పొరపాటు అవుతుంది. ఏపీలోనూ మూడు ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. బలమైన రాజకీయ నేపథ్యంతో కూడిన ఈ పార్టీలకు పెద్ద ఎత్తున ఓటర్లు ఉన్నారు. ఈ క్రమంలో అందులో చీలిక వచ్చి టీవీకేను ఆకర్షిస్తారు అనుకోవడం కూడా తప్పే అవుతుంది. ఇక సీఎం అయిన తరువాత విజయ్ కర్ణాటకకు వెళ్ళి అక్కడ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలా ఆయన జూన్ 12న కర్ణాటకలోని ఉడిపి జిల్లాలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం కొల్లూరు శ్రీ మూకాంబికా దేవి ఆలయాన్ని దర్శించుకున్నపుడు కూడా పెద్ద ఎత్తున జనాలు హాజరై స్వాగతం పలికారు. ఇవన్నీ ఆయన మీద వ్యక్తిగత అభిమానానికి నిదర్శనాలుగానే చూడాలని అంటున్నారు.

కేంద్ర బిందువుగా :అయితే దక్షిణాదిన ఎవరికీ లేని అవకాశాలు అయితే విజయ్ కి ఉన్నాయి. ఆయనకు ఉన్న సినీ గ్లామర్ దళపతి ఇమేజ్ వల్ల సులువుగా దక్షిణాది రాష్ట్రాలలోకి ప్రవేశించగలరు. కానీ ఆయన రాజకీయ ఆకాంక్షలు నెగ్గాలి అన్నా టీవీకే మరింతగా విస్తరించాలి అన్నా లేక ఆయన సౌత్ ఇండియా ఫేస్ గా బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలి అన్నా మూల కేంద్రంగా తమిళనాడు మాత్రమే ఉంటుంది. అక్కడ ఆయన ఎంత బలపడితే అంతగా ఆ ప్రభావం ఇతర రాష్ట్రాల మీద పడవచ్చు. ఆయన ముందు ఇంట గెలవాలి. అంటే తమిళనాడులో ఆయన టీవీకే ప్రభుత్వం ప్రజల మన్ననలు పొంది మంచి పనులు చేసినపుడు ఆటోమేటిక్ గా అది ఆయన దక్షిణాది రాష్ట్రాలలో పార్టీ విస్తరణకు ఉపయోగపడవచ్చు. అయితే అది ఇపుడే జరిగేది కాదు, దీనిని చాలా సమయం ఉంది. విజయ్ తమిళనాడులో తన రాజకీయాన్ని బలోపేతం చేసుకోవాలి. ఆ మీదట ఆయన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ దండయాత్రకు అది అనుకూలిస్తుంది అన్నదే అసలైన విశ్లేషణ.

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు.ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

అభ్యర్థుల ఎంపికలో జగన్ కొత్త వ్యూహం !

తమకు పంపించాలని ఆయన కోరడం ఇందుకు కారణం. అదే సమయంలో పార్టీ తరపున స్వయంగా చేయించుకున్న సర్వే నివేదికను దగ్గర ఉంచుకుని మరీ ఈ షార్ట్ లిస్ట్ లోని అభ్యర్థులతో సరిపోల్చుతూ అంగ బలం అర్ధ బలంతో పాటు ప్రజా బలాన్ని బేరీజు వేస్తున్నారు. అదే సమయంలో వైసీపీ అభ్యర్థులుగా ఈసారి వారికి ఉండాల్సిన అదనపు లక్షణాలను కూడా జత చేరుస్తూ అలాంటి వారినే బరిలోకి దించుతున్నారు.

అసలైన క్వాలిఫికేషన్ :
వైసీపీ అభ్యర్థులకు అసలైన క్వాలిఫికేషన్ ఏమిటి అన్నది కూడా జగన్ తన చర్యల ద్వారా తెలియచేస్తున్నారు అని అంటున్నారు అది విధేయత. వైసీపీ తరపున గెలిచిన వారు రేపు పార్టీని వీడి ఉండకుండా అట్టేబెట్టుకుని ఉండాలంటే వారు పార్టీకి కట్టుబడి ఉండాలని ఆ విధంగా ఎమోషన్ బాండేజ్ వారికి ఉందా లేదా అన్నది తరచి చూస్తున్నారు అని అంటున్నారు. అందుకే చాలా చోట్ల వైసీపీ ఇంచార్జిల బంధువులకు, అలాగే పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన వారికి వైసీపీ తప్ప మరో పార్టీ రాజకీయ భావజాలాన్ని ఇష్టపడని నేతలను ఏరి కోరి మరీ ఎంపిక చేస్తున్నారు. ఇలా ఎంపిక చేసిన వారికే బీ ఫారాలు దక్కుతున్నాయి.

గ్రౌండ్ లెవెల్ లో వర్కౌట్ :
ఎందుకంటే ఏపీలో రాజకీయం అయితే రెండుగా చీలిపోయింది. రెండు శిబిరాలు అయ్యాయి. ఇక 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక చాలా చోట్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరపున గెలిచిన వారు అంతా కూటమికి జై కొట్టి ఫిరాయించారు. అందుకే ఆ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని జగన్ ఈ రకంగా ఎంపిక చేస్తున్నారు అని అంటున్నారు. దీని వల్ల భవిష్యత్తులో పార్టీకి మేలు జరుగుతుందని అంటున్నారు. కేవలం అంగబలం అర్ధ బలం ఉంటే సరిపోదని కూడా ఇపుడు వైసీపీలో అభ్యర్థుల ఎంపిక తీరు చూస్తే అర్థం అవుతోంది అని విశ్లేషిస్తున్నారు. ఏది ఏమైనా స్థానిక సంస్థల విషయంలో వైసీపీ అధినాయకత్వం సీరియస్ గానే ఉంది. క్యాడర్ కూడా ఇపుడు దానిని అర్థం చేసుకుని ఎంత మేరకు గ్రౌండ్ లెవెల్ లో వర్కౌట్ చేస్తుందన్నది చూడాల్సి ఉంది.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 16)

భారత్-అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు.ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

ఇరాన్ పై అమెరికా కొత్త బాంబు !

పేలుతుందని, భూమి లోపలికి చొచ్చుకు పోతుందని తెలుస్తోంది. ఇది పేలిన చోట నుండి 1.6 కిలోమీటర్ల పరిధిలో భవనాలు, వాహనాలు, కొండలు, లోయలు, టన్నెల్స్ అంతా నాశనం అయిపోతుంది. 2017లో ఆఫ్ఘనిస్తాన్ లో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు తలదాచుకున్న టన్నెల్స్ మీద వేసినప్పుడు 90 మంది మరణించారు. ఇరాన్ లో అయిల్, గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నేపథ్యంలో ఎక్కువ నష్టం జరుగుతుందని భావిస్తున్నారు.2000 సంవత్సరంలో ఇది తయారు చేసినప్పుడు అయిన ఖర్చు లక్ష 70 వేల డాలర్లు. అప్పట్లో ఇవి దాదాపు 15 యూనిట్లు తయారు చేసినట్లు సమాచారం. ఇప్పుడు ధర భారీగా పెరిగే అవకాశం ఉంది. అయితే యుద్ధం ప్రస్తుతం డెడ్ లాక్ లో ఉంది. మిడ్ టర్మ్ ఎన్నికల తర్వాత ట్రంప్ విజయం సాధించినట్లు ప్రకటించి సైన్యాన్ని వెనక్కి తీసుకోవచ్చని చర్చ నడుస్తోంది. మరి ఏం జరుగుతుందో వేచి చూడాలి.

ఇంద్రకీలాద్రిపై సీఎం చంద్రబాబు దంపతుల ప్రత్యేక పూజలు



ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ముఖ్యమంత్రి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దుర్గమ్మ దర్శనం సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.శక్తిస్వరూపిణిగా భక్తుల పూజలందుకునే కనకదుర్గమ్మ సన్నిధిలోముఖ్యమంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించడం విశేషంగా నిలిచింది. అమ్మవారి దర్శనం కోసం ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సందడిని సంతరించుకున్నాయి.

ఎంపీటీసీ 4 బరిలో నిలిచేందుకు ఖాద్రి కుటుంబం ఆసక్తి టీడీపీ అధిష్ఠానం అవకాశం కల్పిస్తుందని ఆశాభావం



(షణ్ముఖ వెలుగు, కంభం అక్టోబర్ 16) కంభం మండల పరిషత్ ఎన్నికల్లో భాగంగా కంభం పట్టణంలోని ఎంపీటీసీ 4 స్థానం జనరల్ మహిళలకు రిజర్వు కావడంతో, ఈ స్థానం నుంచి తన భార్య సయ్యద్ నూర్జహాన్‌ను పోటీకి నిలపాలని టీడీపీ సీనియర్ నేత సయ్యద్ నూరుల్లా ఖాద్రి భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తమ కుటుంబం మూడు తరాలుగా పార్టీకి నిరంతరంగా, నిస్వార్థంగా సేవలందిస్తూ వస్తోందని ఖాద్రి తెలిపారు. తమ కుటుంబం పార్టీకి చేసిన సేవలను అధిష్ఠానం గుర్తించి, ఎంపీటీసీ 4 స్థానం నుంచి తన భార్యకు పోటీ చేసే అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో త్వరలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి, తన భార్యకు ఎంపీటీసీ టికెట్ కేటాయించాలని కోరనున్నట్లు నూరుల్లా ఖాద్రి వెల్లడించారు. కాగా ఎంపీటీసీ 4 స్థానానికి సంబంధించి పార్టీ టికెట్ ఇంకా ఖరారు కాలేదు. టికెట్ కేటాయింపు పై టీడీపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా జంగంగుంట్లలో ఎస్ఐ శివకృష్ణారెడ్డి పర్యటన



(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 16) మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కంభం మండలంలోని ఎన్నికల పరంగా అత్యంత సున్నితమైన గ్రామమైన జంగంగుంట్లలో కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే చర్యలకు పాల్పడకూడదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ గ్రామస్థులకు సూచించారు.

గెలుపే లక్ష్యంగా అన్ని వార్డుల్లో పర్యటించాలి



(షణ్ముఖ వెలుగు, చీరాల, అక్టోబర్ 16) మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు సూచించారు. చీరాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించిన డాక్టర్ ఇస్తర్ల షెర్లి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో వెంకటేష్ బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తూ, అన్ని వార్డుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు పాల్గొన్నారు.



శ్రీగిరి శ్రీవారికి సాలగ్రామ మాల సమర్పణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 16)

శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం భాస్కరుని వెంకట అనిల్ కుమార్, వరలక్ష్మి, కుమారుడు గార్గేయ సాలగ్రామమాలను సమర్పించారు. అర్చకులు వేద పండితులు వారికి వేద ఆశీర్వచనంతో పాటు శ్రీ వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాలగ్రామమాలను శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి సమర్పించిన దాతలను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు అభినందించారు.





ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
17.10.26 శనివారం

పురపాలక ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రణాళికతో పని చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 16)

పురపాలక ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రణాళికతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. తదుపరి అధికారులతో సమావేశం అయ్యారు. పురపాలక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలంటే అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం ఉండరాదని సూచించారు. ఎన్నికల నిర్వహణకు నాలుగు జోన్ లుగా విభజించిన నేపథ్యంలో జోనల్ అధికారులను నియమించాలన్నారు. ఎన్నికల విధి నిర్వహణలో చురుగ్గా, నిబద్ధతతో పనిచేయాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. 62 వార్డులు ఉండగా, 21 రూట్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. ఎం సి సి కమిటీని శుక్రవారం నియమించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి అన్ని కమిటీలకు సమర్థులైన అధికారులను నియమించాలన్నారు. ఎక్కడ ఎలాంటి లోపాలకు తావు లేకుండా ▶4లో....

స్థానిక పోరులో విజయమే లక్ష్యం

అభ్యర్థుల ఎంపికలో పార్టీ నిర్ణయమే ఫైనల్
మండల స్థాయిలో సమన్వయ కమిటీలు
24/7 అందుబాటులో లీగల్ సెల్
సమన్వయంతో పని చేయాలి
ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, అక్టోబర్ 16)

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపికలో పార్టీ నిర్ణయమే అంతిమమని, వ్యక్తిగత అభిప్రాయాలు, ఆశయాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులందరినీ సమన్వయం చేసుకుంటూ ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. శుక్రవారం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి, పార్లమెంట్ పరిశీలకులు జంగా కృష్ణమూర్తి, బాపట్ల జిల్లా తెదేపా అధ్యక్షుడు శేలగల రాజశేఖర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి విజయ్‌లు హాజరయ్యారు.

మండల స్థాయిలో సమన్వయ కమిటీలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నరేళ్ల పాలన అనంతరం జరుగుతున్న ఎన్నికలు ఇవని ఏలూరి పేర్కొన్నారు. గత ఎన్నికల్లో పోటీకి అవకాశం లేని పరిస్థితులు నెలకొన్నాయని, ఎన్నికలు ఏకపక్షంగా సాగాయని గుర్తుచేశారు. ఈసారి గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల మద్దతును విజయంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల ఎంపికలో సమన్వయం కోసం ప్రతి మండలంలో ఐదు నుంచి పది మంది సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కమిటీలు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో చర్చించి అభిప్రాయాలను సేకరిస్తాయని, అభ్యర్థుల పేర్లను పరిశీలించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తాయని వివరించారు.

బెదిరింపుల రాజకీయాలకు దూరంగా ఉండాలి

గతంలో వైకాపా నాయకులు బెదిరింపులకు పాల్పడి, తెదేపా నాయకులు, కార్యకర్తలు నామినేషన్లు వేయకుండా ఇబ్బందులకు గురిచేశారని ఏలూరి విమర్శించారు. అయితే, తాము అలాంటి రాజకీయాలకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు వైకాపా పాలనపై విసిగిపోయారని, ఆ పార్టీ నేతలు వేసే రాజకీయ ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నాయకులు వరాలుగా విడిపోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని, అందరూ ఐక్యంగా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.

పదవి కోసం కాదు.. ప్రజాసేవ కోసం పనిచేయాలి

ప్రజా ప్రతినిధి పదవిని ఆశించడం సహజమని, పదవుల ద్వారా సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే, గుర్తింపుతోపాటు ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం కూడా ఉండాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో తాను బాధ్యత తీసుకుంటానని, ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని తెలిపారు. ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే పార్టీ నాయకుల దృష్టికి తీసుకురావాలే తప్ప, బయట అసంతృప్తి వ్యక్తం చేయడం సరికాదన్నారు. అలాంటి చర్యలు వ్యక్తిగత గౌరవానికి, పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు.

రిజర్వేషన్లపై అపోహలు వద్దు

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపు ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత రోస్టర్ విధానం ప్రకారం జరుగుతుందని ఏలూరి వివరించారు. ఏ అధికారి లేదా ప్రజాప్రతినిధి వ్యక్తిగతంగా కోరినంత మాత్రాన రిజర్వేషన్లను మార్చడం సాధ్యం కాదని, ఈ ప్రక్రియ నిర్దిష్ట నిబంధనలకు అనుగుణంగా సాగుతుందని తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన రిజర్వేషన్లలో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీని, జడ్పీటీసీ సభ్యులు జడ్పీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారని వివరించారు.







మేయర్‌గా కుప్పం ప్రసాద్‌ను గెలిపించాలి

నగరప్రజలకు చుండూరి రవిబాబు విజ్ఞప్తి
జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక
మాజీ కార్పొరేటర్ ఇంతియాజ్‌తో పాటు 20 మంది చేరికలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 16)

ఒంగోలు నగర మేయర్‌గా వైఎస్సార్‌సీపీ ప్రకటించిన కుప్పం ప్రసాద్‌ను గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. అదేవిదంగా ఓటర్లు ప్రసాద్ ను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు.వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ పార్టీకి విశేష సేవలందించిన కుప్పం ప్రసాద్‌ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం సంతోషకరమన్నారు. నగర పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో పాటు నగరంలోని సమస్యలు, ప్రజల అవసరాలపై ప్రసాద్‌కు అవగాహన ఉందని తెలిపారు. మున్సిపల్ పాలనలో జవాబుదారీతనానికి ప్రాధాన్యమిస్తూ, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారనే నమ్మకం తమకుందని పేర్కొన్నారు. ▶4లో....

తెలుగుదేశంలోకి జోరుగా చేరికలు

ఎమ్మెల్యే ఇంటూరికి మద్దతుగా పార్టీలోకి
స్థానిక ఎన్నికలకు ముందుగానే వైసీపీకి షాక్‌లు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 16)

స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటినుంచి కందుకూరు నియోజకవర్గంలో వైసిపికి వరుసగా షాక్ లు తగులుతూనే ఉన్నాయి. అనేక గ్రామాలలోని వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆ పార్టీకి టాటా చెప్పేస్తున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతుగా, ఆయన సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకుంటున్నారు. తాజాగా శుక్రవారం 3 మండలాల్లోని నాయకులు వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరారు. లింగసముద్రం మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన మల్లిరెడ్డి పెదరాగయ్య, చెన్నకృష్ణ, వెంకటనరసింహం వడ్డివల్లి రాములు, రొడ్డ ఆనంద్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామ టిడిపి నాయకుడు పల్లపోతు వెంగళరావు, గ్రామ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గుడ్లూరు మండలం కర్లపాలెం గ్రామనాయకుడు చావల రమణయ్య ఆధ్వర్యంలో లంకె వెంకటకృష్ణ, అప్పాడి శ్రీను, అయ్యల శ్రీను, నెల్లూరి ప్రసాద్, రాసాని శ్రీనివాసులు, తదితరులు పార్టీలో



▶4లో....

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు
పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన
సమస్యాత్మక ప్రాంతాల పై ప్రత్యేక నిఘా

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, అక్టోబర్ 16)

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ శుక్రవారం చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్, పాటిమీదపాలెం, ఇస్లాంపేట ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు బందోబస్తు, ముందస్తు భద్రతా ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. చీమకుర్తి మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు, 13 పోలింగ్ లొకేషన్లు ఉండగా, వాటిలో 10 నార్మల్, 2 సెన్సిటివ్, 1 హైపర్ సెన్సిటివ్ లొకేషన్‌గా గుర్తించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, భౌగోళిక పరిస్థితులు, రాకపోకల మార్గాలు, రూట్ మ్యాప్‌లు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత తదితర అంశాలను పరిశీలించి, ఎన్నికల విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి



▶4లో....

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన







అసౌకర్యం కలగకుండా క్యూ లైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల నిర్వహణ, పోలీసు బందోబస్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలవద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా, ప్రజలందరూ సంయమనం పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గత నెల రోజులుగా ముందస్తు నివారణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రౌడీషీటర్లు (చెడు నడత కలిగిన వ్యక్తులు) గతంలో ఎన్నికల సమయంలో అల్లర్లు లేదా ఇతర సమస్యలకు కారణమైన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో పల్లెనిద్ర, విలేజ్ విజిట్లు, నాకాబందీ, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ ఎన్ఫోర్స్మెంట్ ను సమర్థవంతంగా నిర్వహిస్తుమన్నారు. అదేవిధంగా ఆయుధాల డిపాజిట్, ఎన్నికల నియమావళి అమలు పై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం, ఆయుధాలు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వినియోగించే వస్తువుల రవాణాను అరికట్టేందుకు చీమకుర్తి లో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ఎన్నికలకు సంబంధించి అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసినా, ప్రజలను రెచ్చగొట్టే లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో చీమకుర్తి మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ ప్రసాద్, చీమకుర్తి మునిసిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య, సిబ్బంది ఉన్నారు.

కంభం జడ్పీటీసీ స్థానాన్ని ముస్లిం మైనారిటీలకు కేటాయించాలి

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ అత్తర్ హుస్సేన్ దాదా విజ్ఞప్తి



(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 16)

కంభం మండల జడ్పీటీసీ స్థానాన్ని ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి కేటాయించి, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ అత్తర్ హుస్సేన్ దాదా పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కంభం జడ్పీటీసీ స్థానాన్ని ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి కేటాయించడం ద్వారా ఆ వర్గానికి రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల్లో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించేలా పార్టీ నాయకత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ముస్లిం మైనారిటీల ఆశయాలు, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని కంభం జడ్పీటీసీ స్థానం కేటాయింపు విషయంలో పార్టీ అధిష్ఠానం న్యాయం చేయాలని షేక్ అత్తర్ హుస్సేన్ దాదా విజ్ఞప్తి చేశారు.

పురపాలక ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రణాళికతో పని చేయాలి





చూసుకోవాలని పలు సూచనలు చేశారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో 62 డివిజన్లు ఉండగా తొలి రోజు నామినేషన్ ప్రక్రియపై కలెక్టర్ ఆరా తీశారు. ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ స్థానానికి మొదటిరోజు ఎలాంటి నామినేషన్ దాఖలు కాలేదని కమిషనర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వార్డు మెంబర్ కు ఒక నామినేషన్ దాఖలు అయ్యిందని వివరించారు. తదుపరి రిటర్నింగ్ అధికారులతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఒంగోలు ఆర్డీవో టి.చంద్రశేఖర్, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్థానిక పోరులో విజయమే లక్ష్యం


24 గంటలూ అందుబాటులో న్యాయ సహాయం

ఎన్నికల సమయంలో నాయకులు, కార్యకర్తలకు న్యాయపరమైన సహాయం అందించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ లీగల్ సెల్ అందుబాటులో ఉంటుందని ఏలూరి తెలిపారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం క్రియాశీలంగా లేని పార్టీ శ్రేణులను కూడా చైతన్యపరిచి ఎన్నికల కార్యాచరణలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ బలాన్ని పెంచుతూ, కూటమి అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం : ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఏలూరి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం దశలవారీగా చర్యలు తీసుకుంటోందన్నారు. గత వైకాపా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఐకమత్యంతో ముందుకు సాగితే విజయాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.

మేయర్‌గా కుప్పం ప్రసాద్‌ను గెలిపించాలి





గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, విద్యా, వైద్య రంగాలకు ఇచ్చిన ప్రాధాన్యతను ప్రజలు గుర్తు చేసుకోవాలని రవిబాబు కోరారు. కరోనా సమయంలో వాలంటీర్ల ద్వారా ప్రజలకు అందించిన సేవలను ప్రస్తావించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు ఆలోచించాలని అన్నారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కుప్పం ప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు నగరంలో జనసేన పార్టీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. బండ్లమిట్టకు చెందిన కావేటి రవి, మాజీ కార్పొరేటర్ ఇంతియాజ్‌తో పాటు సుమారు 20 మందిని చుండూరి రవిబాబు పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

తెలుగుదేశంలోకి జోరుగా చేరికలు





చేరారు. కందుకూరు మండలం శ్రీరంగరాజపురం ఎస్సీ కాలనీకి చెందిన దాసరి ప్రభాకర్, గుంటక వెంకటేశ్వర్లు, సుదర్శి జయ, ఇంకా పలువురు సైకిల్ ఎక్కారు. మండల టిడిపి అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పాలూరు దొండపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు వినోద్ రెడ్డి, పూనూరు వీరారెడ్డి, వంకదారి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. వారందరినీ ఉద్దేశించి ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో, అన్ని స్థానాల్లో భారీ మెజారిటీలు సాధించేలా కలిసిమెలిసి పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఈ చేరికలకు ప్రధాన కారణమని ఎమ్మెల్యే అన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసిపి విధానాలు నచ్చక, అనేకమంది ఆ పార్టీని వీడి తెలుగుదేశంలోకి వస్తున్నారని తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఎమ్మెల్యే మాలకొండయ్య



(షణ్ముఖ వెలుగు, చీరాల, అక్టోబర్ 16)

మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రజలను కోరారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని బోస్‌నగర్‌లో వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యువ నాయకుడు మద్దులూరి గౌరీ అమర్నాథ్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులతో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేదాల కంటే పూర్వమే శ్రీ సూక్తం మహామంత్ర బాసిల్లింది

ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 16)

వేదాల కంటే పూర్వమే శ్రీ సూక్తం మహామంత్ర రాజ్యమై బాసిల్లిందని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కేశవ స్వామి పేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో మంత్రి ప్రగడ నరసింహారావు స్మృత్యర్థం ఏర్పాటు చేసిన త్రయాహ్నిక ఉపన్యాస యజ్ఞంలో పొన్నూరు వేంకట శ్రీనివాసులు శ్రీ సూక్తంపై ప్రసంగించారు. సాక్షాత్తు లక్ష్మీదేవి అనుగ్రహం కోసం నిత్యం శ్రీ సూక్త పారాయణ చేయాలని అన్నారు. శ్రీ సూక్త పారాయణ వల్ల ఐశ్వర్య వృద్ధి, ఆరోగ్య వృద్ధి, వాక్కు శుద్ధి, అన్ని రంగాలలో అభివృద్ధి కలిగి కీర్తి ప్రతిష్టలు పొందుతారని అన్నారు. శ్రీ సూక్తంలోని 15 రుక్కులలో ఉన్న అంతరార్థాలను, భావాలను తన ఉపన్యాసం ద్వారా ప్రవచించారు. శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం ఈవో రావెళ్ళ శివశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అర్చక స్వాములు శ్రీధర్ ఆచార్యులు, రాంబాబు ఆచార్యులు లక్ష్మి అమ్మవారి చిత్రపటానికి పూజా కార్యక్రమాన్ని జరిపించారు. గంగా అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ తూము సుబ్బారావు, కార్యక్రమ నిర్వాహకులు మంత్రి ప్రగడ ప్రసాద్, ప్రకాశంజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షులు కల్లగుంట కృష్ణయ్య, ప్రముఖ గాయకులు ఐ మురళీకృష్ణ, మొవ్వా నాగేశ్వరరావు, సాహితీ విమర్శకులు ఓరుగంటి ప్రసాద్, ఆనందమయ సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి అన్ను విజయ కుమారి, గుఱ్ఱం కృష్ణ, దామా సుబ్బారావు, హరనాథ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టిడిపిలోకి 10 కుటుంబాలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మండల టిడిపి నాయకులు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, అక్టోబర్ 16)

మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన పది కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం వెల్లటూరి గ్రామంలో వీరందరికీ మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండల టిడిపి నాయకులు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు తాము ఆకర్షితులమై టిడిపిలో చేరినట్లు తెలిపారు. అనంతరం సాంబశివరావు మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతాగినికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, కొండ్రగుంట శ్రీనివాసరావు, మన్యం రమణయ్య, మండవ మురళీమోహన్ డి మధుబాబు, అనుమోలు సుధాకర్ బాబు డి సురేష్, మన్యం మల్లికార్జునరావు, పల్లపోతు రమేష్ బాబు, అనుమోలు రాజా రవీంద్ర, కొండగట్టు నరసయ్య, తానికొండ మహేంద్ర,పి కృష్ణారావు, పి మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
5 | 17.10.26 శనివారం

పొదిలిలో వైభవంగా శ్రీ పోలేరమ్మతల్లి నవరాత్రి ఉత్సవాలు

ఆలయ ఛైర్మన్ ముని శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 16)
పట్టణంలో శ్రీ పోలేరమ్మ తల్లి నవరాత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల వేడుకల్లో భాగంగా శుక్రవారం పోలేరమ్మ దేవస్థానం నుండి పొదిలమ్మ దేవస్థానం వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా భక్తులు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే పొంగళ్లతో పాటు, పట్టు వస్త్రాలను సంప్రదాయబద్ధంగా తప్పెట్లు, వాయిద్యాలు, మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ ఆధ్యాత్మిక శోభతో కూడిన ఊరేగింపులో స్థానిక మహిళలు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ



కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ ముని శ్రీనివాసులు, మండలి సభ్యులు, వీరా జయంతి, వీరా దివ్య, చందా ఉషారాణి, కోడె వరలక్ష్మి, కాకర్ల హైమావతి, కాటూరి కృష్ణవేణి, చెరుకూరి శివకుమారి, వీరా కృష్ణవేణి, తమ్మినేని పద్మ, మల్లె లక్ష్మి, మర్రిపూడి కుమారి, నంది అశ్విని, పర్వతం ఆదిలక్ష్మి, గాలేటి ప్రభావతి, పాలకుర్తి నీలిమ, నల్లమోతు భువనేశ్వరి, సోము శ్యామల, గాలేటి రామసుబ్బమ్మ, పోలేపల్లి అపర్ణ, తదితరులు పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజల్లో భాగస్వామ్యులయ్యారు.



శ్రీ పోలేరమ్మ అలయంలో శ్రీ లలితా త్రిపురసుందరీ దేవిగా అలంకరణ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, అక్టోబర్ 16)
చిన్నగంజాం మండలం మున్నంవారిపాలెం శ్రీపోలేరమ్మ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఐదో రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. అలయ అర్చకుల అద్వర్యంలో అట్ల రాంబాబు-ప్రసన్నాంజిలి దంపతులు అమ్మ వారికి అభిషేకాలు నిర్వహించి,శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుల సుబ్బారెడ్డి కుంకుమార్చనలు, బిల్వా పూజలు, రుద్రాభిషేకం, హోమం, తది తర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వికరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు, ఎంప్లాయిస్, మహిళ భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే చర్యలు

సీఐ జగదీష్





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 16)
ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని కందుకూరు సిఐ జగదీష్ హెచ్చరించారు. తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులు రోడ్డు మార్జిన్ కు అవతలే పెట్టుకుని వ్యాపారం చేసుకోవాలని, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా సహకరించాలని సీఐ సూచించారు. అలాకాకుండా రోడ్డు మీద బండ్లు పెట్టి ట్రాఫిక్కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో అంకాలమ్మ తల్లి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 16)
మూలా నక్షత్రం శుక్రవారం కంభాలపాడులో వెలసిన శ్రీశ్రీ అంకాలమ్మ తల్లి దసరా శరన్నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీ సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా దేవస్థాన ప్రధాన అర్చకులు ఆలూరి వెంకటరమణ శర్మ వేద మంత్రో చ్చరణలతో గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర సాంప్రదాయ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయ దాతలు వీరిశెట్టి విద్యాసంస్థల అధినేత మద్దుల శ్రీనివాసులు, లక్ష్మీ కుమారి దంపతులు, పొదిలి పట్టణ వ్యాపారవేత్త గొంట్ల శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని, భక్తులకు అన్న అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాసరావు, బిట్స్ విద్యా సంస్థల చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, నేలటూరి డిబ్బారెడ్డి, తహసీల్దార్ మద్దుల వెంకట కృష్ణారెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కల్లూరి రవికుమార్‌రెడ్డి, చాతరాసి సురేష్, అంబటి ఓబుల్‌రెడ్డి, మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, కల్లూరి భాస్కర్‌రెడ్డి, మేకల చిన్న, పుట్టా వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, తదితరులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించి, అమ్మవారి కృపాకటాక్షములు పొందారు.

ఒంగోలు నగరంలో కార్పొరేషన్ ఎలక్షన్స్ కోసం డివిజన్ల వారీగా సమన్వయ కమిటీల ఏర్పాటు

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 16)
ఒంగోలు నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ఎన్నికల కార్యాచరణను పటిష్టంగా ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని డివిజన్ల వారీగా పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రతి క్లస్టర్‌కు ముగ్గురు సభ్యులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీలు తమ పరిధిలోని డివిజన్లలో పార్టీ పరిస్థితులను సమీక్షిస్తూ, కూటమి పార్టీల నాయకులతో, స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లనున్నాయి. సమన్వయ కమిటీలు ప్రధానంగా డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో సమన్వయం చేయడం, పార్టీ గెలుపునకు అనుకూలమైన పరిస్థితులను అంచనా వేయడం, స్థానికంగా ప్రజాదరణ కలిగిన నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం వంటి బాధ్యతలను అదేవిధంగా పార్టీ తరఫున టికెట్ ఆశించి అవకాశం లభించని నాయకులు, ఆశావహులను సమన్వయ కమిటీ సభ్యులు కలిసి బుజ్జగించాలని, వారందరినీ పార్టీ ఐక్యతలో భాగస్వాములను చేసి సమష్టిగా పనిచేసేలా చూడాలని ఎమ్మెల్యే జనార్ధన్ సూచించారు. వ్యక్తిగత అభిప్రాయ భేదాలకు తావివ్వకుండా, పార్టీ ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసేలా కమిటీలు కీలక పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలను కూడా సమన్వయ కమిటీలు పర్యవేక్షిస్తూ, డివిజన్ల వారీగా ప్రచార ప్రణాళికలను రూపొందించడం, నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రజల్లోకి పార్టీ విధానాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్లడం వంటి అంశాల పై ప్రత్యేక దృష్టి సారించనున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేస్తూ, తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణ, ఐక్యత, సమష్టి కృషితో ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలని పిలుపునిచ్చారు.





హిందూ ధర్మం యొక్క గొప్పతనం ప్రచారం చేయాలి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, అక్టోబర్ 16)
హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని విస్తృతంగా హిందువులకు తెలియ చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రాంత సహా




సంయోజక్ ముద్దు సాయిరాం తెలియజేశారు. మన హిందూ ధర్మం యొక్క గొప్పతనం తెలిసిన వాళ్ళు ఎవరు మతమార్పిడికి లోను కారని ఆయన ఉద్ఘాటించారు. మండలంలోని ఉప్పలదిన్నె గ్రామ హరిజనవాడలో గల శ్రీరామ కళ్యాణ మండపంలో సమరసతా సేవా ఫౌండేషన్ మండలంలోని ఏడు గ్రామాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎస్ఎఫ్ ప్రాంత సహా సంయోజక్ ముద్దు సాయి పాల్గొన్నారు. వారితో పాటు జిల్లా ధర్మ ప్రచారక్ జి వెంకటేశ్వర్లు, మండల ధర్మ విస్తారక్ టి బ్రహ్మయ్య, మండల విహెచ్‌పి కార్యపర్గ సభ్యులు మన్నెం వెంకటేశ్వర్లు, మండల విహెచ్‌పి మాతృశక్తి ప్రముఖ్ నేలపాటి కృష్ణవేణి, వేంపాడు, ముప్పాళ్ళ, రెడ్డిపాలెం, చెరుకూరు, రావులకొల్లు, వెంకుపాలెం, చెన్నిపాడు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు భద్రత, రక్షణ పై భరోసా కల్పించడమే లక్ష్యంగా ఫ్లాగ్ మార్చ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 16)
ఒంగోలు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు భద్రత, రక్షణ పై భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పి ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలులోని పాత మార్కెట్ సెంటర్ నుండి గోరెంట్ల కాంప్లెక్స్ ప్రాంతంలో, జయరాం టాకీస్ నుండి గద్దలగుంట వరకు అంబికా షాపింగ్ మాల్ నుండి అద్దంకి బస్టాండ్ వరకు ముఖ్య కూడళ్లు, కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో పోలీసులు తిరుగుతూ ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహణలో ఒంగోలు డిఎస్పి ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శక, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీసులు ప్రజలకు తోడుంటారని, ప్రజలు అధైర్య పడకుండా రాజ్యాంగం ద్వారా సంక్రమించిన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజలకు భద్రత కల్పించుటకు పోలీస్‌శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలియచేసారు. ప్రజలు ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని, ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడినా, గొడవలు సృష్టించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పక్షాలు, ప్రజలు పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో ఒంగోలు వన్ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు, టూ టౌన్ సిఐ వీరనాయక్, తాలూకా సిఐ విజయ్ కృష్ణ, ట్రాఫిక్ సిఐ హజరత్తయ్య, ఎస్ఐలు స్పెషల్ పార్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పక్షాలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి
ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడి గొడవలు, అల్లర్లు సృష్టించే వారి పై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరికలు







షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

స్థానిక అభ్యర్థుల ఎంపిక పై మొదలైన కసరత్తు

ఉలవపాడులో కూటమి నేతలతో ఎమ్మెల్యే ఇంటూరి సమావేశం

జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల్లో సత్తా చాటాలని పిలుపు









(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 16)

కందుకూరు నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా మండలంలోని తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల ముఖ్య నేతలతో ఉలవపాడులో ఎమ్మెల్యే నాగేశ్వరరావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా అభ్యర్థుల ఎంపికపై, స్థానిక నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. గెలుపే లక్ష్యంగా, స్థానికుల అభిప్రాయాలతోనే అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. మూడు పార్టీల నాయకులు పరస్పరం సహకరించుకుంటూ, ప్రతి స్థానాన్ని గెలుచుకునేలా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరావు ఎంపీటీసీ స్థానాల వారీగా నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు ఆశావహులు ఎమ్మెల్యేని కలిసి తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీనియారిటీ, కష్టపడే తత్వంతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తులనే అభ్యర్థులుగా ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. మండలంలో జడ్పిటిసి, ఎంపీపీ సహా 15 ఎంపీటీసీ స్థానాలు గెలుచుకునేలా కష్టపడాలని నేతలకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి వివరించి అత్యధిక మెజారిటీలతో కూటమి అభ్యర్థులు గెలిచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉలవపాడు పంచాయతీ కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన వెలిచెర్ల రఘురామయ్య, ఎమ్మెల్యే నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, మండల జనసేన అధ్యక్షుడు అయ్యప్ప, మండల బిజెపి అధ్యక్షుడు రాంబాబు, టీడీపీ క్లస్టర్ ఇన్చార్జిలు పోలుబోయిన శ్రీనివాసులు, బెల్లం కృష్ణమోహన్, ఏఎంసీ డైరెక్టర్ అమ్మనబ్రోలు మాధవ, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మద్దసాని మహేంద్ర, అన్ని గ్రామాల నేతలు హాజరయ్యారు.

ప్రాచీన కాలంలోని గురుశిష్యుల అనుబంధాలను గుర్తు చేసి ప్రజలను ఆకర్షించిన విద్యార్థుల పురప్రదర్శన

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 16)

ఈ నెల 13వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హిందూ ధర్మ పరిరక్షణ కమిటీ చైర్మన్, విశ్రాంత జిల్లా కలెక్టర్ దాసరి శ్రీనివాసులు గుండ్లకమ్మ నది ప్రయాణంలో భాగంగా మండల కేంద్రమైన తర్లుపాడులో ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాన్ని, వీరభద్రస్వామి ఆలయాలను సందర్శించారు. ఆ సయంలో తొమ్మిది రోజుల నదీ పరివాహక ప్రాంతాలలో దర్శించిన గుడుల ప్రాసస్త్యాన్ని, ప్రకృతిని గురించి వివరిస్తూ ప్రాచీన కాలంలో గురు శిష్యుల అనుబంధాలు ఎలా ఉండేయో ఆనాటి వేషధారణలతో పురవీధులలో దసరా పండుగ సందర్భంగా ప్రదర్శించాలన్న ఆయన సూచన మేరకు మండల కేంద్రంలో దసరా పండుగ సందర్భంగా గురు శిష్యుల అనుబంధాలను, ఆనాడు గురువులకు శిష్యులతో పాటు ప్రజలు కూడా ఎలాంటి గౌరవ మర్యాదలు ఇస్తారో అనే రీతిలో వేషధారణల వేసి గ్రామ పురవీధులలో ప్రదర్శించారు. వీరి వేషధారణలు అనాది కాలంలో గురు శిష్యుల అనుబంధాలను గుర్తు చేస్తూ ప్రజలు ఆనందంగా వారి ప్రదర్శనను తిలకించారు. అంతే కాక విద్యార్థిని, విద్యార్థులు అయ్యవారికి చాలు ఐదు వరహాలు, పిల్లవాండ్లకు చాలు పప్పు బెల్లాలు అంటూ పాట పాడుకుంటూ ఇండ్ల ముంగిళ్లలో ప్రదర్శించడం గ్రామస్తులను ఆకట్టుకోవడం వీరి ప్రదర్శన అద్భుతం కలిగించింది. ఈ కార్యక్రమం వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావు, నెహ్రూ యూత్ మండల అధ్యక్షులు బెడుదూరి పుల్లయ్య, భవనం రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేవీ జగన్‌బాబు, జె జనార్దనరావు, జె వెంకటేశ్వర్లు, జె లక్ష్మీ వెంకట సత్యనారాయణ, జెవి భాస్కరరావు, వాసవి, వనిత క్లబ్ అధ్యక్షులు సిహెచ్ రవికుమారి, కోటి మోహన్, సువర్ణ, కోలగట్ల కృష్ణారెడ్డి, భవనం రామకృష్ణారెడ్డి, కె భాస్కరరెడ్డి, గురుదక్షిణ, పిల్లలకు చాకిలెట్స్, బిసుకట్లు, పప్పులు బొరుగులు పంచి పెట్టారు.







క్వీన్స్ విద్యాసంస్థల్లో ఉత్సాహంగా దసరా వేడుకలు

పెద్దఎత్తున పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు ముగ్గులు, మెహందీ పోటీలు

నృత్యాలు, పాటలతో అలరించిన విద్యార్థులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 16)



ఒంగోలులోని క్వీన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు దసరా వేడుకలు అంబరాన్నంటాయి. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దసరా సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, మెహందీ పోటీలు ఏర్పాటు చేయగా విద్యార్థులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తుల్లో దసరా పాటలకు, సినిమా పాటలకు నృత్యాలు చేసి అలరించారు. 50 మంది విద్యార్థులు సామూహికంగా పాడిన అయిగిరి నందిని అందరినీ ఎంతగానో అలరించింది. అమ్మవారి అలంకరణ అందరినీ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు క్వీన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్వీన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై వి హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, వివిధ విభాగాల డీన్‌లు, డైరెక్టర్లు, హెచ్ వోడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణ పర్యవేక్షించారు.





తొలి రోజు ఏడు నామినేషన్లు వైసీపీ నుంచి 5, టీడీపీ నుంచి 2 దాఖలు

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 16)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. తొలి రోజు నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసే సమయానికి మొత్తం 7 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 5, తెలుగుదేశం పార్టీ తరఫున 2 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇతర పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థుల నుంచి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వీరే..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 1వ వార్డు నుంచి ఏసీకే వెంకటరమణ, 7వ వార్డు నుంచి షేక్ జమాల్ బాషా, 19వ వార్డు నుంచి షేక్ రిజ్వానా, 23వ వార్డు నుంచి గోపు పద్మ, 28వ వార్డు నుంచి జగన్నాథం కావేరి నామినేషన్లు దాఖలు చేశారు.

టీడీపీ అభ్యర్థులు వీరే..

తెలుగుదేశం పార్టీ తరఫున 7వ వార్డు నుంచి షేక్ అల్తాఫ్, 30వ వార్డు నుంచి ఏపీ రవీంద్ర నామినేషన్లు సమర్పించారు. మైదుకూరు మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులు ఉండగా, ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. తొలి రోజు ఏడు నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లయింది. మిగిలిన రెండు రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశముంది. నామినేషన్ల గడువు ముగిసే నాటికి ఏయే వార్డుల్లో ఎంతమంది అభ్యర్థులు బరిలో నిలుస్తారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

మాచర్ల వైసీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా షేక్ సుల్తానా నామినేషన్



(ఔణుఖ్ఫ్లుగు, జూచ్లో టౌన్, చీక్టోబుర్ 16)

మాచర్ల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రకటించిన షేక్ సుల్తానా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని 33వ వార్డుకు చెందిన ఆమె నూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ వరకు విద్యాభ్యాసం పూర్తి చేశారు.

మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ జలీల్‌కు కోడలైన సుల్తానాకు పార్టీ అధిష్ఠానం చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. స్థానికంగా 33వ వార్డుకు చెందిన ఆమె అభ్యర్థిత్వానికి సంబంధించి వైసీపీ నాయకులు నాగూర్, జానీ భాష నామినేషన్‌ను బలపరిచారు. మాచర్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో షేక్ సుల్తానా నామినేషన్ దాఖలు చేయడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

దసరా ఉత్సవాలకు పరాశక్తి సిమెంట్స్ రూ.50 వేల విరాళం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 16)

కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పురస్కరించుకొని రూ.50 వేల చెక్కును జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రాజు అందజేశారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా యాజమాన్యం భక్తులకు మెరుగైన సేవలందించే నిమిత్తం విరాళాలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవి శివయ్య, ఆలయ ఈవో గాదె రామిరెడ్డి, ఫ్యాక్టరీ డీసీఎం మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నగరపాలక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 16)

ఒంగోలు నగర పాలక సంస్థ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మేయర్ పదవికి పోటీ చేసే అభ్యర్థుల కోసం నగర పాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా 62 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థుల కోసం డిఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్, రాంనగర్ మున్సిపల్ హైస్కూల్, పీవీఆర్ బాయ్స్ హైస్కూల్‌లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే తొలిరోజు మేయర్ పదవికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కార్పొరేటర్ స్థానానికి మాత్రం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. డిఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్ కేంద్రంలో 1వ డివిజన్ నుంచి నవ్వూరి కుమారి నామినేషన్ పత్రాలను సమర్పించారు. టీడీపీ తరఫున పోటీ చేస్తున్నట్లు ఆమె వెల్లడించినప్పటికీ పార్టీ బీ ఫారం మాత్రం రిటర్నింగ్ అధికారికి సమర్పించలేదు. ఇక అసలు రాజకీయ సందడి రెండో రోజు నుంచి కనిపించనుంది. శనివారం మేయర్ పదవితో పాటు పెద్ద సంఖ్యలో కార్పొరేటర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కూటమిలో భాగమైన టీడీపీ, జనసేన, బీజేపీ తమకు కేటాయించిన డివిజన్లలో అభ్యర్థులను బరిలోకి దింపేందుకు సిద్ధమవుతుండగా వైసీపీ, వామపక్షాలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు కొంతమంది అభ్యర్థులు ఇప్పటికే తమకు కేటాయించిన నామినేషన్ కేంద్రాలకు వెళ్లి పత్రాలను తీసుకెళ్లారు. దీంతో రెండో రోజు నామినేషన్ల కేంద్రాల వద్ద రాజకీయ సందడి మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయంతో పాటు మిగిలిన మూడు కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తూ ఎన్నికల ప్రక్రియకు సంబంధం లేని వ్యక్తులను నామినేషన్ కేంద్రాల నుంచి బయటకు పంపిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పరిశీలించారు.





ఉచిత వైద్య సేవలకు విశేష ఆదరణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 16)

జిల్లా ఆయుష్ విభాగ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భ్రమరాంబ తెలిపారు. ఈ శిబిరంలో 156 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించి, రోగులకు పరీక్ష నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.



మైదుకూరు అమ్మవారిశాలలో మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి

వాసవి మాత అమ్మవారి దర్శనం
వాసవీమాతకు ప్రత్యేక పూజలు
శాలువాతో సత్కరించిన ఆర్యవైశ్య సభ ప్రతినిధులు



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 16)

మైదుకూరు పట్టణంలోని అమ్మవారి శాలలో జరుగుతున్న శ్రీ వాసవీమాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బల్లాని చేన్నకేశవ ప్రసాద్‌తో పాటు కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వాసవీమాత దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి, అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ ప్రతినిధులు మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిని శాలువాతో సత్కరించారు. మైదుకూరు అమ్మవారి శాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ అమ్మవారికి వివిధ రూపాల్లో అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కమిటీ వారు కోటా అశోక్ కుమార్, దొంతు వెంకట సుబ్బయ్య, జూటూరు బాలవీరయ్య, కటకం వెంకట సుబ్బయ్య, శంకురి వెంకట రమణ, నూకల సత్యనారాయణ, కొప్పరపు రామకృష్ణ, చిలంకూరి మారుతీ, ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.





మైదుకూరు అమ్మవారిశాలలో వైభవంగా భువనేశ్వరి దేవి అలంకారం

6వ రోజు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవీమాత





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 16)

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మైదుకూరు పట్టణంలోని అమ్మవారి శాలలో ఆరవ రోజు శ్రీ వాసవీమాత అమ్మవారు భువనేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలవిరాట్ అమ్మవారితో పాటు ఉత్సవమూర్తి అమ్మవారిని భువనేశ్వరి దేవి అలంకారంలో సర్వాంగసుందరంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో సందడి నెలకొంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి వివిధ రూపాల్లో ప్రత్యేక అలంకారాలు నిర్వహిస్తుండటంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతూ అమ్మవారి కృపాకటాక్షాలు పొందుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి నామస్మరణలు, పూజా కార్యక్రమాలతో మైదుకూరు అమ్మవారి శాలలో పండుగ వాతావరణం నెలకొంది.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ చేసిన పోలేపల్లి



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 16)

మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామపంచాయతీలో పారిశుద్ధ కార్మికులుగా పనిచేస్తున్న ఎనిమిది మంది కార్మికులకు శ్రీశైలం, వాసవి సముదాయ సత్రం కార్యదర్శి పోలేపల్లి జనార్థన్ నూతన దుస్తులను శుక్రవారం అందజేశారు. గ్రామంలో వారు చేస్తున్న పనితీరును మెచ్చుకొని గ్రామపంచాయతీ వ్యవస్థ ఏర్పడిన నాటి నుండి ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా ఈ దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

మైదుకూరులో 144 సెక్షన్,
30 పోలీసు యాక్ట్ అమలు
నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు పోలీసుల ముఖ్య సూచనలు
నలుగురికి మించి గుమికూడరాదు
చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు
మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 16)
మైదుకూరు పట్టణ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ సూచనల మేరకు మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి పట్టణ ప్రజలకు పలు ముఖ్యమైన సూచనలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు సంయమనం పాటించాలని, పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. పట్టణ పరిధిలో అమలులో ఉన్న నిషేధాజ్ఞలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమతి లేని సమావేశాలు నిర్వహించడం, నిబంధనలకు విరుద్ధంగా నలుగురికి మించి ఒకచోట గుమికూడడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


ప్రజలు పాటించాల్సిన ముఖ్య సూచనలు:

ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న 144 సెక్షన్‌తో పాటు 30 యాక్ట్ ఇతర నిషేధాజ్ఞలు, పోలీసు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించే వారు సంబంధిత అధికారుల అనుమతులు, నిబంధనలు పాటించాలి. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం సంయమనం పాటించాలి. ప్రత్యర్థి పార్టీలపై దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, గొడవలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలి. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, నిరాధార ఆరోపణలు, రెచ్చగొట్టే పోస్టులు, ప్రజలను తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయరాదు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చట్టవిరుద్ధ



చర్యలకు పాల్పడరాదు. పట్టణంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, గొడవలు జరిగే అవకాశం ఉన్నా, శాంతిభద్రతలకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటిస్తూ, ఎలాంటి వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలి. ఈ సందర్భంగా సీఐ హాజీవలి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేసినా, ఇతరులను రెచ్చగొట్టి గొడవలకు కారణమైనా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు చిరంజీవి, కత్తి వెంకటరమణ పాల్గొని ప్రజలకు ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనలు, పోలీసు శాఖ సూచనలను వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని వారు సూచించారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

కందిమల్లాయపల్లెలో ఘనంగా శరన్నవరాత్రులు
5వ రోజు ప్రత్యేక పూజలు



(షణ్ముఖ వెలుగు, బ్రహ్మంగారి మఠం, అక్టోబర్ 16)
జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం, కందిమల్లాయపల్లె క్షేత్రంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారి దివ్య ఆశీస్సులతో నవరాత్రుల



ఐదవ రోజైన శుక్రవారం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి భక్తిశద్ధలతో సుప్రభాత సేవ నిర్వహించారు. సాయంత్రం శ్రీ గోవిందమాంబ అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే భక్తులచే సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాలు కన్నులపండువగా చేపట్టారు. రాత్రి విశేషమైన షష్ఠమ అఖండ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు కాకినాడ 2, సున్నావారి వీధికి చెందిన మండన చిన్నమ్మాయి ఉభయదాతలుగా వ్యవహరించారు. తాత్కాలిక ఆధ్వర్యులుగా ఇడమకంటి జనార్ధన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం సేవలందించారు. ఈ వేడుకలను మఠం మేనేజర్ పిపిఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

అభిమానుల కోలాహలం నడుమ ఘనంగా శిద్దా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలపడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చిన అభిమానులు, ప్రముఖులు

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, అక్టోబర్ 16)
పారిశ్రామిక వేత్త, చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షులు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తనయుడు శిద్దా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు ఒంగోలు లోని వారి నివాసంలో, చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో అభిమానుల కోలాహలం నడుమ అట్టహాసంగా జరిగాయి. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడానికి అభిమానులు యువత, వ్యాపార వర్గాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతుల సమక్షంలో ఒంగోలు లోని వారి నివాసంలో తమ గ్రూప్ ఆఫ్ గ్రానైట్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును శిద్దా సుధీర్ కుమార్ దంపతులు కుటుంబ సభ్యులతో కలసి కట్ చేశారు. తొలుత శిద్దా రాఘవరావు దంపతులు శిద్దా సుధీర్ కుమార్ కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానుల ఆధ్వర్యంలో భారీ గజమాలతో శిద్దా సుధీర్ కుమార్ దంపతులు శిద్దా రాఘవరావు దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కనమర్లపూడి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో నూతన కమిటి సభ్యులు, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, కోట హనుమంతరావు, ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ నాయకులు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు జలదంకి కృష్ణారావు, పెనుగొండ శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య నాయకులు భారీ కేక్, గజ మాలతో శిద్దా సుధీర్ కుమార్ దంపతులను, శిద్దా రాఘవరావు దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు, చీమకుర్తి, దర్శి, మార్కాపురం, పొదిలి ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య మహిళలు శిద్దా సుధీర్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియచేశారు.

చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా
సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు

శిద్దా సుధీర్ కుమార్ జన్మదినం సందర్భంగా ఆలయ అర్చకులు శిద్దా సుధీర్ కుమార్ దంపతులను మంగళ వాయిద్యాల నడుమ, వేద మంత్రాలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం శిద్దా సుధీర్ కుమార్ కుటుంబ సభ్యులతో కలసి క్షేత్రంలో వేంచేసివున్న సకల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరిబాబు ఆధ్వర్యంలో, జ్యోతి గ్రానైట్ సిఓఓ ఎం శివ రామ్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మురారిశెట్టి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో శిద్దా సుధీర్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ శిద్దా సుధీర్ కుమార్ కుటుంబ సభ్యులతో కలసి కట్ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇంచార్జి ఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆధ్వర్యంలో భారీ గజమాలను శిద్దా సుధీర్ కుమార్ దంపతులకు అలంకరించి తెలిపారు. చీమకుర్తికి చెందిన పలువురు గ్రానైట్ రంగాలకు చెందిన ప్రముఖులు, వ్యాపార వాణిజ్య వేత్తలు, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు శిద్దా సుధీర్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.













On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com